## పరిచయం:

# నూతన క్రైస్తవునకు ఒక మాట

దేవుడు తనకు ఏంచేశాడని ఒక అమెరికా భారతీయుని అడిగారు. ఆ వ్యక్తి కొన్ని ఎండు టాకులను వృత్తాకారంలో పేర్చాడు. తరువాత ఆ వృత్తం మధ్యలో చిన్న పురుగును ఉంచి ఆకులకు నిప్పు పెట్టాడు. మంట విస్తరించి ఆ పురుగు కాలిపోయే సమయంలో ఆ వ్యక్తి చిన్న పుల్లను పురుగుకు అందించాడు, దాని సాయంతో పురుగు మంట నుండి తప్పించుకొని బయటపడింది. ఆ వ్యక్తి ఆ పుల్లను పైకెత్తి, "దేవుడు నాకు చేసింది ఇది!" అని చెప్పాడు.

క్రీస్తునందున్న వారు అన్ని ఆత్మీయ ఆశీర్వాదాలను పొందుతారు (ఎఫెసీయులకు 1:3; 2 పేతురు 1:3). దేవుని కృప ద్వారా ఆయన సర్వమానవాళి రక్షణకై ప్రణాళికను వేశాడు (యోహాను 3:16-19). ఆ ప్రణాళికలో భాగమై దాన్ని పొందిన వారందరూ క్రీస్తు శరీరంలో (సంఘంలో) భాగం. అతిపరిశుద్ధ దేవుని "యాజకుడై" అశాంతితోనున్న ఈ లోకంలోకి దేవుని చేత క్రీస్తు పంపబడి శాంతిని అనుగ్రహించాడు. దేవుని ఆజ్ఞలకు వారందరూ విధేయులై ఒకే శరీరంగా, ఐక్యంగా వుండి శక్తిని, ప్రోత్సాహాన్ని అనుగ్రహించు సహవాసం అనుభవిస్తున్నారు.

మార్పు అనేది "చీకటి" మార్గంనుండి "వెలుగు" మార్గం వైపు తిరగడముగా వాక్యంలో వివరించబడింది. చీకటి నుండి వెలుగు భిన్నంగా ఉన్నట్లే క్రైస్తవ జీవితం కూడా పాపపు జీవితానికి భిన్నమైనది. ఈ ఉదాహరణ క్రైస్తవ నిశ్చయతను చూపిస్తుంది. చీకటి భయపడుతుంది కానీ, వెలుగు ధైర్యాన్నిస్తుంది. చిన్న పిల్లలు రాత్రిళ్ళు పడుకునే సమయంలో లైటును ఆర్పకుండా ఉంచమంటారు. ఎందుకంటే, అది భయాలను పోగొట్టి ధైర్యాన్నిస్తుంది. సముద్ర తీర ప్రాంతాల్లో నావికులకు అభయ సూచనలిస్తూ లైట్ హౌసులను ఏర్పాటు చేస్తారు.

క్రైస్తవునిగా ఉండడంలోని ఆనందాన్ని గుర్తించిన వారి కోసమే ఈ పాఠాలు వ్రాయబడ్డాయి. క్రీస్తునొద్దకు వచ్చినవాని జీవితంలోని ప్రతి విషయమును రక్షణ నూతన పరుస్తుంది. తన ఆ నూతన జీవితంలో దేవుని కృపాశీర్వాదములు ఉంటాయి. ఈ క్రొత్త జీవితం ఆనందంగా ఉన్నా, అది సవాలు కరంగా ఉంటుంది. సాతానుడు నూతన విశ్వాసిని పాపమునకు శోధిస్తాడు. ఆ జీవితంలోని ఒడిదుడుకులు దేవుని యెడల ఉన్న భక్తిని కుదుపుతాయి. జీవితంలోని శోధనలు మిమ్మల్ని వాక్యానుసారంగా కాకుండా లోకానుసారంగా జీవించేటట్లు ఉసిగొల్పవచ్చు. క్రైస్తవునిగా జీవించడం ఆనందంగా ఉన్నా, ఇది కష్టతరమైది. కొంతమంది తాను సంపూర్ణులము కాలేమని, కష్టాలు అధికంగా ఉన్నాయని విశ్వాసాన్ని విడిచిపెట్టేస్తుంటారు. మీరలా చేయకండి! క్రీస్తు శరీరమను సంఘములోనికి నూతనంగా చేర్చబడ్డ మీకు క్రైస్తవుని గా ఏం అవసరమో గుర్తుచేయటం ఎంతో అవసరం.

ఈ పాఠాలు మీకు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సమర్పణ గల క్రైస్తవునిగా జీవించడంలోనున్న ఆచరణాత్మక సమస్యలు గురించి ఇందులో చర్చిద్దాము. దేవుని పిల్లలముగా జీవించడంలో మంచి సమర్పణ కలిగియుండేలా మనం సవాలు చేయబడతాము.

మన చర్చనీయాంశం వెలుగు మరియు చీకటి అన్న అలంకారాన్ని వాడుతుంది. అన్యుల యొద్దకు వెళ్ళి "వారు చీకటిలోనుండి వెలుగులోనికిని సాతాను అధికారం నుండి దేవుని వైపునకును తిరిగి, నాయందలి విశ్వాసము చేత పాపక్షమాపణను పరిశుద్ధ పరచబడిన వారిలో స్వాస్థ్యమును పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారి యొద్దకు పంపెదనని" పౌలునకు ప్రభువు ఆజ్ఞాపించాడు (అపొ 26:18). ఇప్పుడు క్రైస్తవులైన మీరు దేవుని పిల్లలుగా చీకటి నుండి వెలుగుకు రప్పింపబడి, "విశ్వాసము చేత పరిశుద్ధ పరచబడి" భిన్నమైన జీవితమును జీవిస్తున్నారు. ప్రతి పాఠాన్ని చదివి, క్రైస్తవునిగా అందులోని అద్భుత ఆశీర్వాదములను గ్రహించండి.